

## 24న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఈ నెల 24న ఉదయం 10గంటలకు నగర స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నామని స్టెప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి జోయల్ విజయ్‌కుమార్ తెలిపారు. స్టెప్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ యువజనోత్సవాల్లో పలు అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల వయసు యువతీ యువకులు పోటీల్లో పాల్గొనేందుకు సన్నద్ధం కావాలన్నారు. కంపోనెంట్ యాక్టివిటీ, కల్చరల్ ట్రాక్ (జిల్లా నుంచి జాతీయస్థాయి వరకు)లో.. జానపద నృత్యం (10 మంది గ్రూపు), జానపద గేయం (10 మంది గ్రూపు), కవిత్వం, కథారచన, పెయింటింగ్, ఇన్నోవేషన్ ట్రాక్ (జిల్లా మరియు రాష్ట్రస్థాయి వరకు మాత్రమే), సైన్స్ మేళా అంశాల్లో ప్రదర్శన ఇవ్వచ్చన్నారు. ఆసక్తి గల యువత ఆన్‌లైన్‌ద్వారా https://tinyurl.com/dyfysr2025 లింకులో వారికి ప్రావీణ్యం గల వాటిలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఒక పోటీలో మాత్రమే పాల్గొనాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయిలో విజేతలైన వారు జాతీయ స్థాయిలో పాల్గొనాలన్నారు. ఏదేని ఇతర వివరాలకు 9949298810, 9849497011 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ మేరకు స్టెప్ సీఈవో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## పారిశ్రామిక పార్కులపై అవగాహన కార్యక్రమాలు



ఏపీఐఐసీ - ఇండస్ట్రీ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ అదితిసింగ్

కడప ఎర్రముక్క పల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ ఇండస్ట్రీ పార్ట్‌నర్ షిప్ డ్రైవ్ పోస్టర్‌ను కలెక్టరేట్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పరిశ్రమల శాఖ సంయుక్తంగా నవంబరు 14, 15 తేదీల్లో భాగస్వామ్య సమావేశం నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా ఈనెల 15 నుంచి నవంబరు 15 వరకు జిల్లాలో పారిశ్రామిక పార్కు ల్లో మౌలిక సదుపాయాలపై యువ పారిశ్రామిక వేత్తలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవ ర్గంలో ఒక పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఉపాధి అవకాశాలపై వివరిస్తారన్నారు. ఔత్సాహిక పారిశ్రా మక వేత్తలు, ప్రజాప్రతినిధులు ఈకార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాస మూర్తి, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, జాయింట్ కమిషనర్, జీఎస్టీ, డిప్యూటీ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

## దీపావళికి ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు/కడప, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించు కుని గుంతకల్లు రైల్వే డివిజ న్ మీదుగా పలు సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైళ్లను నడప నున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి-సికింద్రాబాద్ ప్రత్యేక రైలును (నంబర్ 07497) ఈ నెల 17న, దీని తిరుగు ప్రయాణపు రైలును (07498) 18న నడపుతారు. ఈ రైలు బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, సూలేహళ్లి, యాదగిరి, క్రిష్ణా, రాయ చూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది.

అదే విధంగా షోలాపూర్-ధర్మవరం ప్రత్యేక రైలును (01437) ఈ నెల 16న, దీని తిరుగు ప్రయాణపు రైలును (01438) ఈ నెల 18న నడుపుతారు. ఈ రైలు కురుద్వాడి, బర్సి టౌన్, ధారాశివ్, లాతూరు, లాతూరు రోడ్, ఉద్గిర్, భల్కి, బీదర్, వికారాబాద్, యాదగిరి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి రోడ్డు, మొలకలచెరువు, కదిరి స్టేషన్ల మీదుగా ధర్మవరానికి చేరుకుంటుంది.

## సాహిత్య సేవలను విస్తృతం చేస్తాం

● వీసీ బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ భాషా పరిశో ధన కేంద్రం వేదిక గా తెలుగు భాషా సాహిత్యాలను మరింత విస్తృత పరుస్తామని వైవీయూ వీసీ ప్రొఫెసర్ బెల్లం కొండ రాజశేఖర్ అన్నారు. ఇటీవల వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారిగా గురువారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. బ్రౌన్ గ్రంథాలయం వెనుక నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలను పరిశీలించారు. బ్రౌన్ నివాసమున్న బంగళా, సమాధి చిత్రాలను పరిశీలించి బ్రౌన్ సాహితీ సేవలను, గ్రంథాలయ నిర్మాణానికి ఎవరెవరు ఎంత కృషిచేశారన్న అంశాలను తెలుసుకున్నారు. భాషా పరిశోధన కేంద్రంలో ఉన్న పుస్తకలను, తాళపత్ర గ్రంథాలను, హ్యాండ్‌మేడ్ పేపర్స్, తామ్రపత్రాన్ని, సిద్ధాంత గ్రంథాలను, బ్రౌన్ రచనలను పరిశీలించారు. గ్రంథాలయ నిర్వహణ, విధివిధానాలను తెలుసుకుని సాహిత్యపరంగా బ్రౌన్ కేంద్రాన్ని మరింత ఉన్నతికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.పద్మ, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సంచాలకులు ఆచార్య జి.పార్వతి, సహాయపరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి పాల్గొన్నారు.

## నిలువెత్తు నిర్లక్ష్యం

సిరిపురి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్.. ఇందులోనే అత్యధికంగా రూ.29,58,652 బకాయిలున్న అద్దెగది ఉంది






● మున్సిపల్ గదుల అద్దె బకాయిలు రూ.62.25 లక్షలు
● బకాయిదారులపై చర్యలు నిల్
● అద్దెలు రూ.2 కోట్ల నుంచి రూ.45 లక్షలకు దిగజారిన వైనం

ప్రొద్దుటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి నిధులు అవసరం. ఇంటి పన్నులు, మున్సిపల్ అద్దెగదుల ద్వారా ఆదాయం సమకూర్చుకుని ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుంది. అయితే ఆ దిశగా ప్రొద్దుటూరు మున్సిపల్ అధికారులు పనిచేయడం లేదు. ఇక్కడ మున్సిపల్ వాణిజ్య షాపింగ్ కాంప్లెక్సుల ద్వారా గతంలో ఏడాదికి రూ.2 కోట్ల మేర ఆదాయం సమకూరేది. నేడు ఆ ఆదాయం రూ.45 లక్షలకు దిగజారింది. ఇందుకు ప్రధాన కారణం కాంప్లెక్స్‌లలోని చాలా మంది ఏళ్ల తరబడి అద్దెలు చెల్లించకపోవడమే. వీరు మూడేళ్ల వరకు అద్దె చెల్లించకుండా ఉండి అద్దె 33 శాతం పెరుగుతుందనగా ఆ గదులు ఖాళీ చేసేస్తారు. అయినా వారిపై ఎలాంటి చర్యలు ఉండవు. ఆఖరికి కేసులు కూడా వేయరు. దీంతో ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

ప్రొద్దుటూరు మున్సిపల్ కాంప్లెక్స్‌లలో గతంలో మొత్తం 333 అద్దె గదులు ఉండేవి. వాటిలో 255 గదులకు అద్దెలు సక్రమంగా వచ్చేవి. వాటిద్వారా ఏడాదికి రూ.2 కోట్ల మేర ఆదాయం సమకూరేది. వైసీపీ ప్రభుత్వంలో 2021లో మార్కెట్ కూల్చడంతో పాటు కోనేటి కాల్వ వీధి 1, 2, కొర్రపాడు రోడ్డు, శివాలయం వీధి, మార్కెట్ ఎదురుగా చిన్నాసుపత్రి పుట్టపర్తి సర్కిల్‌లల్లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లను కూల్చివేశారు. దీంతో మున్సిపాలిటీకి భారీగా ఆదాయం తగ్గింది. కేవలం కామిశెట్టి సుబ్బారావు మున్సిపల్ కాంప్లెక్స్, టీబీ కాంప్లెక్స్, ఎస్‌బీఐ కాంప్లెక్స్, వసంతరావు కాంప్లెక్స్, సిరిపురి కాంప్లెక్స్, పాత మార్కెట్ గదులు, వైఎంఆర్‌కాలనీ పార్కు వద్ద గల గదుల ద్వారా ఆదాయం వస్తోంది. వాటిలో కూడా కామిశెట్టి సుబ్బారావు కాంప్లెక్స్‌లో 28 గదులవారు అద్దె రూ.16,59,932 బకాయి ఉన్నారు. అలాగే సిరిపురి కాంప్లెక్స్‌లో 2024 నవంబరు 1 నుంచి 2025 సెప్టెంబరు 30 వరకు రూము నెంబరు-1 వారు రూ.29,58,652 బకాయి ఉన్నారు. వసంతరావు షాపింగ్ కాంప్లెక్స్‌లో 5 గదుల వారు రూ.3,96,967లు బకాయి పడ్డారు. ఎస్‌బీఐ కాంప్లెక్స్ లో 9 రూముల వాళ్లు రూ.3,97,142 బకాయిలున్నారు. పాత మార్కెట్‌లో 9 మున్సిపల్ గదులకు రూ.8,12,311 బకాయిలున్నారు. మొత్తం బకాయిలు రూ.62.25 లక్షలు ఉన్నాయి. వాటి వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించే సిబ్బంది, అధికారులపై ఎలాంటి చర్యలు ఉండటం లేదు.

### స్పెషల్ డ్రైవ్ పెడతాం

ఏళ్ల తరబడి మున్సిపల్ గదులకు అద్దెలు వసూళ్ల చేయక బకాయిలు పెరిగిన మాట వాస్తవం. సచివాలయంలోని అడ్మిన్ సెక్రటరీలు నెలనెలా వసూలు చేసిఉంటే అద్దె బకాయిలు పెరిగేవి కావు. అద్దె బకాయిల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ పెడతాం. ఖాళీగా ఉన్న గదులకు వేలం నిర్వహించినా వ్యాపారులు ముందుకు రావడంలేదు. 52 గదులున్న టీబీ కాంప్లెక్స్ లోపలికి ఉండటం వలన వ్యాపారాలు జరగడం లేదంటున్నారు. ఆ కాంప్లెక్స్‌ను యా ఆకారంలోకి మార్చాల్సి ఉంది.

- డేనియల్ జోసఫ్, రెవెన్యూ ఆఫీసర్, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ

### ఖాళీగా అద్దె గదులు

కామిశెట్టి సుబ్బారావు టీబీ కాంప్లెక్స్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో 52 గదులున్నాయి. అందులో అద్దెలు బకాయిలు ఉండే గదులు 28. ఖాళీగా ఉండేవి 15. ఫస్ట్ ఫ్లోర్‌లో 9 గదులు ఉండగా అందులో 5 గదులు ఖాళీగా ఉన్నాయి. వసంతరావు కాంప్లెక్స్‌లో 21 గదులకు గాను 8 ఖాళీగా ఉన్నాయి. ఎస్‌బీఐ కాంప్లెక్స్‌లో 19లో కేవలం ఒక్కటి ఖాళీ. ఈ గదులకు సకాలంలో వేలం నిర్వహించరు. వేలం నిర్వహించినా వ్యాపారులు ఎవ్వరూ రావడం లేదని అంటున్నారు.

### ఆరేళ్లుగా సచివాలయ వ్యవస్థ ఉన్నా..

ఆరేళ్లుగా మున్సిపాలిటీ పరిధిలో 46 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయంలో పది మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కానీ మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి పన్నులు, నీటి పన్నులతో పాటు మున్సిపల్ గదుల అద్దెలు వసూళ్ల చేయడంలో వారు సక్రమంగా పనిచేయడం లేదని ఆరోపణలున్నాయి. ప్రతి నెలా వెళ్లి అద్దెలు రాబట్టి ఉంటే లక్షల్లో బకాయిలు పేరుకుపోయేవి కావు. బకాయిలు ఎగవేతకు పాల్పడే అవకాశం ఉండేది కాదని పులువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు అద్దెబకాయిలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేం

● జనరల్ బాడీలో తీర్మానాలు చేసి నెలలు గడుస్తోంది
● తీర్మానాలపై ప్రభుత్వానికి ఎలాంటి ఫిర్యాదూ లేదు
● కడప ఎమ్మెల్యే అప్పీల్ కొట్టివేసిన హైకోర్టు

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ బాడీ మీటింగ్‌లో చేసిన తీర్మానాలను రద్దుచేసే అధికారం కమిషనర్‌కు లేదని, తీర్మానాలను అమలు చేసే విషయాన్ని పరిశీలించాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది. తీర్మానాల అమలు విషయంలో సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయాలని టీడీపీ ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి వేసిన అప్పీల్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది.

జూన్ 20న నిర్వహించిన కడప మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ బాడీ మీటింగ్, అందులో చేసిన తీర్మానాలు చెల్లుబాటుకావని, వాటిని రద్దు చేయడంతో పాటు చెల్లుబాటయ్యే జనరల్ బాడీ మీటింగ్ నిర్వహణకు తేదీని ప్రతిపాదించాలని కోరుతూ కడప మున్సిపల్ కమిషనర్ జూన్ 30, జూలై 1న ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ అప్పటి కార్పొరేషన్ మేయర్ సురేశ్‌బాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. కమిషనర్ ఇచ్చిన నోటీసులను సస్పెండ్ చేశారు. తీర్మానాలను రద్దు చేసే అధికారం కమిషనర్‌కు లేదని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని జనరల్ బాడీ మీటింగ్‌లో చేసిన తీర్మానాలను అమలుచేసే విషయాన్ని పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు.

అయితే, సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ కడప టీడీపీ ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. ఆమె తరఫున న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర వాదనలు వినిపిస్తూ.. చట్టనిబంధనల ప్రకారం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహణకు వారం రోజుల ముందు సమావేశం జరిగే స్థలం, సమయాన్ని తెలియజేస్తూ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రధానంగా.. జనరల్ బాడీ మీటింగ్ నిర్వహణకు ముందు ఎక్స్ అఫిషియో సభ్యురాలి హోదాలో ఎమ్మెల్యేకు నోటీసులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సమావేశం తేదీ మార్చినట్లు ఎక్స్ అఫిషియో సభ్యులకు కానీ, కౌన్సిలర్లకుకానీ ఎలాంటి నోటీసూ ఇవ్వలేదని, సమావేశం జరిగే స్థలం మార్పు గురించి కూడా తెలుపకుండా ఎమ్మెల్యేకు ఉన్న హక్కును హరించారని వివరించారు. ఇలా చట్టనిబంధనలు ఉల్లంఘించి జరిపిన సమావేశం, అందులో చేసిన తీర్మానాలు చెల్లుబాటు కావన్నారు. జనరల్‌బాడీ సమావేశ తీర్మానాలను రద్దు చేసే అధికారం కమిషనర్‌కు లేనప్పటికీ మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 679(ఎ) ప్రకారం కార్పొరేషన్ చేసిన తీర్మానాల విషయంలో కమిషనర్, కార్పొరేటర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా లేదా సుమోటోగా, వాటిని రద్దుచేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని తెలిపారు. సురేశ్‌బాబు తరఫున న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ.. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవద్దని కోరారు. జనరల్ బాడీ మీటింగ్‌లో తీర్మానాలు చేసి నెలలు గడుస్తున్నా.. కమిషనర్, కార్పొరేటర్ల నుంచి ఎలాంటి ఫిర్యాదూ రాలేదన్నారు. జనరల్ బాడీ మీటింగ్‌లో ప్రజా ఉపయోగ తీర్మానాలే చేశారని పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనలనూ పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. కడప ఎమ్మెల్యే మాధవి అప్పీల్‌ను కొట్టివేసింది.

## ఆసుపత్రులకు అనుమతులు తప్పనిసరి

● డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు



ప్రైవేట్ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రులు తప్పక రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని, అనుమతులు లేకుండా నడిపితే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు హెచ్చరించారు. గురువారం నగరంలోని కృష్ణ డెంటల్, శ్రీసాయినర్సింగ్ హోమ్, శ్వేతా హాస్పిటల్, ఇమేజింగ్ డయాగ్నోస్టిక్, శ్రీజ రెయిన్‌బో చిన్న పిల్లల ఆసుపత్రి, తులశమ్మ, పల్లా ఆసుపత్రులతో పాటు దీపక్, శ్రీగణేష్ చెస్ట్ ఆసుపత్రి, రవితేజ డయాగ్నస్టిక్ ఆసుపత్రులను, స్కానింగ్ సెంటర్లను డీఎంహెచ్ఓ, వైద్య సిబ్బంది అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రుల పరిశుభ్రత, ధరల పట్టికలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో ఏ యే వ్యాధికి ఎంత అనే విషయాన్ని తెలిపే ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. వైద్య సేవలకు వచ్చేవారికి రుసుం చెల్లింపులకు సంబంధించి రశీదు ఇవ్వాలన్నారు. ఓపీ, ఐపీ రికార్డులను మెయింటెన్ చేయాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని అన్నారు. స్కానింగ్ సెంటర్లలో సేవలు పొందే వారి వివరాలు ఫారం ఎఫ్ ద్వారా ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. లింగ వివక్షకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిడమాలజిస్ట్ ఖాజా, డిప్యూటీ హెచ్ఈవో కుమారి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్ఎంపీలు ప్రథమచికిత్స మాత్రమే చేయాలి

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్ఎంపీలు వైద్యంకోసం వచ్చే వారికి ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆరోగ్యం బాగాలేదని వచ్చేవారికి సూది మందు, సెలైన్ బాటిల్స్ ఎక్కించడం, రక్తపరీక్షలు నిర్వహించడం, మందులు ఇవ్వడం చేయరాదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలందరూ మెరుగైన వైద్యం కోసం సమీపంలోని ప్రాథమిక ఆసుపత్రులకు వెళ్లాలని, ఆర్ఎంపీలు కూడా ప్రథమచికిత్స అనంతరం ప్రభుత్వాసుపత్రులకు రెఫర్ చేయాలని సూచించారు.

## గడ్డి పంచాయితీ

● గడ్డి తామే విక్రయిస్తామంటూ.. ఇరువర్గాల పట్టు ● ప్రేక్షకపాత్రలో అధికారులు

పులివెందుల మార్కెట్ యార్డులో గడ్డి పంచాయితీ రోజురోజుకు ముదురుతోంది. నిబంధనల ప్రకారం టెండర్‌దారు గడ్డిని అమ్ముకోవాల్సి ఉండగా మరో వ్యక్తి తాను అమ్ముకుంటానంటూ తిష్టవేసుకుని కూర్చున్నారు. ఈ ఇద్దరూ అధికారపార్టీ వారే కావడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.





పులివెందుల మార్కెట్ యార్డులో రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు వేర్వేరుగా నిల్వ ఉంచిన గడ్డి

పులివెందుల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని మార్కెట్ యార్డులో దాదాపు మూడేళ్లుగా చీనీ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇప్పుడిప్పుడే రైతులు తమ పంటను మార్కెట్‌యార్డుకు తరలించి విక్రయాలు జరుపుతున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు కూడా వ్యాపారస్తులకు పలు సౌకర్యాలు కల్పించారు. దీనితో అనంతపురం చీనీ మార్కెట్ తర్వాత పులివెందులలో చీనీ వ్యాపారం బాగా కొనసాగుతోంది. ఇదిలా ఉండగా చీనీకాయలు ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు లారీలో లోడ్ చేసే సమయంలో వరిగడ్డిని నింపుతారు. ఈ గడ్డిని కూడా రైతులే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీనికి రైతుల నుంచి ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే ఎప్పటి నుంచో పులివెందుల టీడీపీలో రెండు వర్గాలు ఉన్నాయి. ఈ రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు ప్రతి విషయంలోను పోటీ పడుతుంటారు. ఈ పోటీ మార్కెట్ యార్డులో వరిగడ్డి విషయంలోను సాగుతోంది.

### టెండర్ దక్కకున్నా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొండూరు మండలం మల్లేల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మార్కెట్ యార్డులో తిష్టవేసి గడ్డి విక్రయాలు జరిపేవారు. ఈ విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయని, గడ్డి విక్రయించుకునేం దుకు టెండర్లు పిలవాలని మరోవర్గానికి చెందిన నేత ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీనితో మార్కెటింగ్ శాఖ అధికారులు దాదాపు నాలుగు నెలల క్రితం టెండర్లు పిలిచారు. సర్కారు వారి పాట రూ.2.50లక్షలుగా నిర్ణయించారు. ప్రస్తుతం అక్కడ గడ్డి విక్రయిస్తున్న వ్యక్తి కేవలం రూ.50వేలకు, మరో వర్గానికి చెందిన వ్యక్తులు రూ.4.50లక్షలు, రూ.2.50లక్షలకు టెండర్ దాఖలు చేశారు. దీంతో పెద్దమొత్తం కోట్ చేసిన వారిలో ఒకరికి టెండర్ దక్కింది. అయినప్పటికీ అక్కడ గడ్డి విక్రయిస్తున్న వ్యక్తి ఖాళీ చేయడం లేదు. టెండర్ దక్కించుకున్న వారూ మార్కెట్‌యార్డులో మరోవైపు గడ్డి విక్రయం చేపట్టారు. దీంతో రైతులు ఎవరివద్దకెళ్లి గడ్డి తెచ్చుకోవాలో తెలీక తలలు పట్టుకుంటున్నారు.

### తక్కువ టెండర్‌కే కేటాయింపు

గడ్డి విక్రయించుకునేందుకు అధికారులు టెండర్లు పిలవగా ఒకరు రూ.4.50లక్షలకు మరొకరు రూ.2.50లక్షలకు టెండర్‌దాఖలు చేశారు. మార్కెటింగ్ శాఖ అధికారులు తక్కువ టెండర్ దారుకు టెండర్‌ను కట్టబెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. వీరిద్దరు ఒకే వర్గానికి చెందిన వారు కావడం గమనార్హం. దీనితో మార్కెటింగ్ శాఖ ఆదాయాన్ని కోల్పోయింది. చీనీ వ్యాపారంతో మార్కెటింగ్ శాఖకు అద్దెలు, పన్నుల ద్వారా ఆదాయం తెచ్చిపెట్టే రైతులకు గడ్డిని కూడా సక్రమంగా సరఫరా చేయలేని దుస్థితిలో ఉన్నారా అంటూ అధికారులపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

### పోలీసులకు ఫిర్యాదు చేశాం

నిబంధనల ప్రకారం టెండర్ దక్కించుకున్న వ్యక్తి గడ్డిని విక్రయించుకోవాలి. అయితే మల్లేలకు చెందిన ఓ వ్యక్తి తాను విక్రయిస్తానని పట్టుబట్టి తిష్టవేశారు. నచ్చజెప్పినా వినకపోవడంతో ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశాం. కాగా.. రూ.4.50లక్షలకు టెండర్ దాఖలు చేసిన వ్యక్తి అగ్రిమెంట్‌కు రాకపోవడంతో రూ.2.50లక్షలకు టెండర్ వేసిన వ్యక్తికి ఖరారు చేశాం.

- అజాద్ వలి, ఏడీ, మార్కెటింగ్ శాఖ


ప్రధాని సభకు ముస్లిం మహిళలు


సభకు వేలాది బస్సులు ఇలా...


మోదీతో చంద్రబాబు, పవన్







# నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)


సభలో ఉప్పొంగిన దేశభక్తి


శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ


సభలో టీడీపీ మహిళా నేతలు




పొలాల వెంబడి పరుగులు

# మహిళా శక్తి కుటుంబానికి బలమైన పునాది

**● కలెక్టర్ నిశాంత్‌కుమార్**

రాయచోటి (నేతాజీసర్కిల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన మహిళా శక్తి కుటుంబానికి బలమైన పునాది లాంటిదని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. గురువారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం ముగింపు కార్యక్రమాన్ని సుధా కన్వెన్షన్ హాల్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్య, వైద్య శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో సెప్టెంబరు 17 నుంచి ఈనెల 16వ తేదీ వరకు జిల్లాలో కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. గతంలో పార్వతీపురం, మన్యం జిల్లాల్లో తన అనుభవాన్ని పంచుకుంటూ అక్కడ 1000 మంది పిల్లలు పుడితే వారిలో దాదాపు 25 మంది పిల్లలు పౌష్టికాహార లోపం వల్ల పుట్టిన సంవత్సరంలోపు చనిపోయేవారని తెలిపారు. దీనికి రకరకాల కారణాలతో ముఖ్యంగా బరువు తక్కువగా ఉండటం, తల్లి గర్భం దాల్చిన సమయంలో ప్రతిరోజు తీసుకునే ఆహారంలో పౌష్టికాహార లోపం, వారికి 9 నెలల పాటు అందించాల్సిన వైద్య సదుపాయాలు అందకపోవడం తదితర కారణాలే కాకుండా డెలివరీ సమయంలో ప్రతి నెలలో దాదాపు మాతా శిశు మరణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. అటువంటి సమస్యలు రాకుండా ప్రతి ఒక్కరూ బలవర్థకమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అంగన్వాడీ కార్యకర్తలకు కలెక్టర్ మెమెంటోలను అందించారు. గర్భిణులకు సీమంతం చేసి వారిని కలెక్టర్ ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ హైమావతి, నగరపాలక సంస్థ కమిషనర్ రవి, ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ కోటేశ్వరమ్మ, జీసీడీవో మాధవి, అంగన్వాడీ, ఆశావర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.


పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

# లేఔట్లను రెగ్యులర్ చేసుకోండి


మాట్లాడుతున్న ఏపీవో క్రిష్ణ సింగ్

రైల్వేకోడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అనధికారిక లేఔట్లను రెగ్యులర్ చేసుకోవాలని ఉమ్మడి కడప జిల్లా కుడా ఏపీవో క్రిష్ణాసింగ్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరులో 19, పుల్లంపేటలో 3, పెనగలూరులో 2, చిట్వేలిలో 1 అనధికారిక లేఔట్లు ఉన్నాయని తెలిపారు. వీటిని ఈనెల 24వ తేదీలోపు రెగ్యులర్ చేసుకోకపోతే లేఔట్లలో ఉన్న హద్దురాళ్లను తొలగిస్తామని హెచ్చరించారు. ప్లాట్ల అమ్మకాలు, కొనుగోలుకు వీలు లేకుండా అన్ని సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో నిషేధిత భూముల రిజిష్టరులో నమోదు చేస్తామని తెలిపారు. అలాగే ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగిరెడ్డి, ఈవోపీఆర్‌డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కలప రవాణాను అడ్డుకున్న అధికారులు

**● అధికారులపై తిరగబడిన వ్యాపారులు**


కలప లారీ రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గుర్రంకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కలపను లోడ్ చేస్తున్న లారీని గురువారం రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో వ్యాపారులు అధికారులపై తిరగబడ్డారు. మండలంలోని వైసీపీకి చెందిన కొందరు కలప వ్యాపారులు రైతుల పొలాలు, ప్రభుత్వ భూముల్లో ఉన్న వృక్షాలను విచ్చలవిడిగా నరికేస్తున్నారు. మార్కెట్ యార్డు సమీపంలోని మామిడితోట, తలారివాండ్లపల్లె, గుండ్లగుట్టతండా, పాలకుంటపల్లె, చెర్లోపల్లె, తరిగొండ ప్రాంతాల్లో కలపను అక్రమంగా డంప్ చేస్తున్నారు. మార్కెట్ యార్డు సమీపంలోని మామిడితోట వద్ద గురువారం అక్రమంగా కలపను లారీకి లోడ్ చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఆర్ఐ సదాశివప్పనాయుడు, సిబ్బంది వెళ్లి కలపను తరలించడానికి అనుమతులున్నాయా అంటూ ప్రశ్నించారు. దీంతో కలప వ్యాపారులు అనుమతులు ఎందుకు చూపించాలంటూ తిరగబడ్డారు. అటవీ శాఖాధికారులు తమకు అనుమతులు ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులను పరిశీలించగా కలప తరలించడానికి వ్యాపారులు దరఖాస్తు చేసుకున్న రికార్డులు మాత్రమే ఉన్నాయి తప్ప అనుమతి లేదు. దీంతో అధికారుల అనుమతి తీసుకున్న తరువాతే కలపను తరలించాలని వ్యాపారులకు సూచించారు. అప్పటి వరకు కలప లారీని బయటకు పంపరాదని వ్యాపారులకు గట్టిగా హెచ్చరించారు.

# వరి పంటపై అడవి పందుల దాడి


అడవి పందులు ధ్వంసం చేసిన వరి పంట

సుండుపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వరి పంటపై అడవి పందులు దాడి చేసి రైతులకు నష్టం చేకూర్చినట్లు గురువారం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ పెద్దవీటి చెన్నయ్య, మూడే రెడ్డినాయక్‌లకు చెందిన వరి పంటలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అడవి పందుల బెడద నుంచి పంటలను రక్షించాలని, నష్టపోయిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు. ప్రతి ఏడాది పంటలు సాగు చేసిన సమయంలో అడవి పందుల దాడి నుంచి రైతులకు విముక్తి కల్పించాలని, అటవీ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉత్తమ రైతు అమ్మనాయక్ డిమాండ్ చేశారు.

# అదృశ్యమైన వ్యక్తి శవమయ్యాడు...

మదనపల్లె అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో గత నెలలో అదృశ్యమైన శ్రీకాంత్ (58) మృతదేహం పుంగనూరు మండలం యాతాల వంకలో బయటపడింది. స్థానిక చిత్తూరు బస్టాండ్‌లో గాయత్రి మెడికల్ షాపు నిర్వహిస్తున్న శ్రీకాంత్ గత నెల 27న అదృశ్యమైనట్లు మదనపల్లె వన్‌టౌన్‌లో సీఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేశారు.

కాగా చిప్పిలి సమీపంలో హంద్రీ-నీవా కాల్వ గట్టుపై శ్రీకాంత్ చెప్పులు, బైక్ వదిలి కనపడకుండాపోవడంతో కాలువలో పడిపోయాడనుకుని మదనపల్లె అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకుండాపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో అదృశ్యం కేసు నమోదు చేశారు. కాగా గురువారం పుంగనూరు మండలం యాతాల వంకలో మృతదేహం బయటపడింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు మదనపల్లె వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసినట్లు తెలిపారు.

# జలమార్గాల అభివృద్ధి సంస్థ సీఈవోగా మురళీనాథరెడ్డి



మదనపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలమార్గాల అభివృద్ధి సంస్థ అదనపు సీఈవోగా ఆర్.మురళీనాథ్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ ఎం.తిరుమల కృష్ణబాబు జీవో జారీ చేశారు. రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి, పెన్నా, తుంగభద్ర నదులు సహా ప్రధాన ప్రాజెక్టుల్లో జలమార్గాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 2023లో ప్రత్యేకంగా చట్టం చేశారు. కాగా ఏడాది కిందట మదనపల్లె హంద్రీ-నీవా సీఈగా ఉద్యోగ విరమణ చెందిన ఈయనను ప్రస్తుత ప్రభుత్వం మొట్టమొదటి సీఈఓగా నియమించింది. ముఖ్యంగా వాటర్ సోర్సు టూరిజం, పోర్టులను అభివృద్ధి చేసే దిశగా అవకాశాలను రూపొందించాలి. వీటిని పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్ (పీపీపీ) విధానంలో అక్కడున్న అవకాశాలను వివరిస్తూ పెట్టుబడులు పెట్టేలా వ్యాపారులను ప్రోత్సహించాలి. తద్వారా ప్రభుత్వానికి సంపద సృష్టించడం, టూరిజాన్ని అభివృద్ధి చేయాల్సి వుంటుంది. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ, తదితర జలవనరుల ప్రాజెక్టుల్లో పనిచేసిన మురళీనాథరెడ్డి ఏడాది కిందట సీఈగా పదవీ విరమణ పొందారు. టన్నెల్ తవ్వకాలు, ఎత్తిపోతల పథకాల నిర్మాణాల్లో మంచి ప్రావీణ్యం ఉందని గుర్తించిన ప్రభుత్వం ఏడాది కాల వ్యవధితో కాంట్రాక్ట్ బేసిక్‌లో సీఈవోగా అవకాశం కల్పించింది. ఈయన విజయవాడ కేంద్రంగా ఇరిగేషన్, టూరిజం, రెవెన్యూ, రోడ్లు, భవనాలశాఖ, పోర్టులు విభాగాలతో అనుసంధానమై పనిచేయాల్సి ఉంటుంది.

# బాలల భద్రతకు పోలీసుల భరోసా

**గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌పై శక్తి టీం స్పెషల్ క్లాసులు**


చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం సభ్యులు

రాయచోటిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ చిన్నారుల భద్రతకు భరోసా ఇస్తోంది. ఇందులో భాగంగానే ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా శక్తి టీం బృందాలు పాఠశాలల్లో బాలల కేంద్రాల్లో గుడ్ టచ్- బ్యాడ్ టచ్ అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బ్యాడ్ టచ్ ఎదురైతే వెంటనే పెద్ద శబ్దంతో నో చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోవాలని చిన్నారులకు చెప్పారు. ఇబ్బందులను దాచకుండా తల్లిదండ్రులు, టీచర్లు, నమ్మకమైన పెద్దలకు మాత్రమే చెప్పాలని సూచించారు. అత్యవసరమైతే 112 (పోలీస్) గానీ 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్)కు గానీ కాల్ చేయాలని అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి భద్రత మాకు అత్యంత ముఖ్యమని, తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహ పూర్వకంగా ఉండాలని, వారు చెప్పే ప్రతి విషయాన్ని శ్రద్ధగా వినాలన్నారు. పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ పిల్లల రక్షణకు అందుబాటులో ఉంటుందని, భయం లేకుండా పోలీసులకు సమాచారం ఇచ్చి సమాజాన్ని బాలల భద్రతను మరింత పటిష్టంగా మార్చడానికి జిల్లా ప్రజలందరూ సహకరించాలని ఎస్పీ తెలిపారు.

# అధికారులు సీజ్ చేశారు.. సిబ్బంది తెరిచారు

**● 24 గంటల్లోనే తెరుచుకున్న అశ్విని ఆస్పత్రి**


అశ్విని ఆస్పత్రిని తెరుస్తున్న రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

వీలేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ అనుమతులు లేవంటూ వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు ఆగమేఘాలపై వచ్చి అట్టహాసంగా అశ్విని ఆస్పత్రిని బుధవారం సీజ్ చేశారు. ఇందులో మతలబేంటో తెలియదు కాని 24 గంటల వ్యవధిలో తిరిగి తెరుచుకుంది. సీజ్ చేసిన ఆస్పత్రిని గురువారం రాత్రి రెవెన్యూ, స్థానిక వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆస్పత్రి నిర్వాహకులైన డాక్టర్ శ్రమంత్ కుమార్ రెడ్డి సమక్షంలో తెరిచారు. దీంతో ఆస్పత్రిని సీజ్ చేసిన 24 గంటల్లోనే తిరిగి ఎందుకు తెరిచారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

అగ్నిమాపక శాఖ అనుమతులు లేవంటూ ఆస్పత్రిని డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య, డెమో దేవశిరోమణి, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి ప్రసాద్ నాయక్ బుధవారం సీజ్ చేశారు. సీజ్ చేసిన అనంతరం అధికారులపై ఒత్తిళ్లు వచ్చాయో లేక ఆస్పత్రి నిర్వాహకులు అనుమతులు తెచ్చుకున్నారో అన్న విషయంలో అనిశ్చితి నెలకొంది. అయితే తమకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి అందిన ఆదేశాల మేరకు ఆస్పత్రిని తిరిగి తెరిచినట్లు స్థానిక సిబ్బంది తెలిపారు. అంతకు మించి తమకు సమాచారం లేదన్నారు.

# రాష్ట్రస్థాయికి సంబేపల్లె విద్యార్థులు

రాయచోటి (నేతాజీసర్కిల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం మధ్యాహ్నం వారధి ఫౌండేషన్ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకర రామకృష్ణ తెలిపారు. డాక్టర్ మోహన్ కందా అధ్యక్షతన నిర్వహించబడుతున్న ప్రభుత్వేతర సంస్థ అయిన వారధి ఫౌండేషన్ వారు ప్రతి సంవత్సరం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయి వార్షిక పోటీలను నిర్వహించి నగదు బహుమతి ప్రదానం చేస్తారన్నారు. సంబేపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన తరుణ్‌కుమార్‌గౌడ్, చిలకమ్మ, మౌనిక అను ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

# రీసర్వేపై అధికారులతో సమీక్ష

రాయచోటి (నేతాజీసర్కిల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భూసర్వే ప్రాజెక్టులో 3వ ఫేస్‌లో జరగనున్న రీసర్వేపై కొంత మంది డిప్యూటీ డైరెక్టర్లతో గురువారం సమీక్ష నిర్వహించినట్లు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ పీవీ జయరాజ్ తెలిపారు. కార్యక్రమానికి ప్రత్యేక అధికారిగా తనను నియమించినట్లు తెలిపారు.

రీసర్వే గ్రామాలను తనిఖీ చేసి ప్రభుత్వ ఆదేశాలు, సూచనల మేరకు రీసర్వే గుణాత్మక పరిణామాత్మకంగా రీసర్వే నిర్వహించాలని, రైతుల సమక్షంలో రీసర్వే ప్రక్రియ ముగించాలని ఆదేశించారు. రీసర్వేలో ఎదురయ్యే సమస్యలపై సర్వేయర్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌లతో చర్చించి రీసర్వే ప్రామాణిక విధానంలో ఎదురయ్యే పలు ఆధునిక సందేహాలకు పరిష్కారం సూచించారు.

# అక్రమాలకు చెక్ దిశగా..

**● ఎనిమిదేళ్ల తర్వాత మదనపల్లె సొసైటీ ఎన్నికలు**

**● ఎన్నికలకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్**

**● రేపు ఓటర్ల జాబితా.. 29న పోలింగ్**

మదనపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో 'మదనపల్లె హౌస్ బిల్డింగ్ సొసైటీ' ఎన్నికల వేడి రాజుకుంటోంది. అభ్యంతరాలు, ఆటంకాల మధ్య ఎన్నికల నిర్వహణకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సహకార శాఖాధికారులు ప్రక్రియ మొదలు పెట్టారు. ఇందులో భాగంగా కలెక్టర్ ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు ఎన్నికల అధికారిని కూడా నియమించారు. అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ ఎన్నికల జాబితా సిద్ధం చేశారు. మదనపల్లె హౌస్ బిల్డింగ్ సొసైటీకి ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో సహకార శాఖాధికారులు వీటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. మరోవైపు అక్రమార్కులకు ఎక్కడికక్కడ చెక్ పెడుతూ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా సన్నాహాలు చేస్తున్నారు.

మదనపల్లె హౌస్‌బిల్డింగ్ సొసైటీ సుమారు 50 ఏళ్ల క్రితం ఏర్పాటైంది. వందలమంది సభ్యులు ఉన్న ఈ సొసైటీకి స్థానిక సొసైటీ కాలనీ, తిరుపతి రోడ్డులోని దేవతానగర్‌కు ఎదురుగా లేఅవుట్‌లు ఉన్నాయి. ఈ క్రమంలో సొసైటీ తరపున ఇప్పటికే కొనుగోలు చేసిన భూమిలో సభ్యులకు ఇక్కడ ప్లాట్లు కేటాయించారు. ఇందులో సొసైటీ కాలనీలో 30 ఏళ్లుగా నివాసాలు ఉండగా, దేవతానగర్ ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో కొందరు నిర్మాణాలు చేపట్టగా అలాట్‌మెంట్ అయినా ఇప్పటికీ మరికొన్ని ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. సొసైటీ ఏర్పడినప్పటి నుంచీ అయిదేళ్ల పదవీ కాలంతో పాలకవర్గాలు ఉండగా, చివరగా 2017 మార్చి నాటికి పాలకవర్గం పదవీకాలం పూర్తయింది. తర్వాత ప్రభుత్వం ఈ సొసైటీకి అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ (పీఐసీ) నియమించింది. ఈ క్రమంలో సొసైటీలో అవినీతి, అక్రమాలు జరిగినట్లు గుర్తించిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. తర్వాత వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. ఇదిలావుండగా, అంతకుముందే సొసైటీలోని సభ్యుల (ఓటర్ల)ను జాబితా నుంచి తొలగించారని అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి, సహకార శాఖాధికారులపై న్యాయస్థానానికి వెళ్లారు. ఇదే వ్యక్తిపైనే సొసైటీలోని మరో సభ్యుడు కూడా న్యాయస్థానానికి వెళ్లారు. ఈ కేసులపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఎన్నికలు జరపాలని సూచించింది. ఆ మేరకు సహకార శాఖాధికారులు కలెక్టర్‌ను సంప్రదించి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లారు. ఇంతకాలం హౌస్‌బిల్డింగ్ సొసైటీలో జరిగిన అవినీతి, అక్రమాలను అప్పటి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్తూ, అక్రమార్కుల ప్రయత్నాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటూ వచ్చారు. చివరకు న్యాయస్థానంలోని కేసులు ఓ కొలిక్కి రావడంతో తిరిగి ఎన్నికలకు వెళ్తున్నారు. వీటిని కూడా అడ్డుకునేందుకు కొందరు అక్రమార్కులు అడ్డదారులు వెతుకుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

**ఎన్నికల షెడ్యూల్ ఇలా..**

ఇందులో భాగంగా సోమవారం నాటికి క్లయిమ్‌లపై అభ్యంతరాల గడువు ముగిసిపోవడంతో మంగళవారం పీఐసీ, ఎన్నికల అధికారికి ఓటర్ల జాబితా అప్పగించారు. 18వ తేదీ ఓటర్ల తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నారు. 22న నామినేషన్ల స్వీకరణ, 23 నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ, అదేరోజు పోటీలోని అభ్యర్థుల ప్రకటన ఎన్నికల గుర్తుల కేటాయింపు ఉంటుంది. ఒకవేళ అభ్యర్థుల మధ్య పోటీ ఉంటే 29న పోలింగ్, 30వ తేదీ ఎన్నికల కౌంటింగ్, ఫలితాలు వెల్లడించనున్నారు. మొత్తం 239 మందికి ఓటు హక్కు ఉంది.

**అక్రమాలు ఎలాగంటే..**

సొసైటీలోని సభ్యులకు సొసైటీ తరపున కొనుగోలు చేసిన భూమిలో ప్లాట్లు కేటాయిస్తారు. ఆ సమయంలో సభ్యునికి అలాట్‌మెంట్ (ప్రొసీడింగ్) కాపీ ఇస్తారు. దీని ఆధారంగా తర్వాత నిర్ణీత సమయంలో సభ్యుడు ఆ ప్లాటును రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అయితే సొసైటీ కాలనీలో 30 ఏళ్ల క్రితం జరిగిన అలాట్‌మెంట్‌లో చాలామంది రిజిస్ట్రేషన్లు చేసుకోలేదు. అలాట్‌మెంట్ ఆధారంగా నిర్మాణాలు చేపట్టి కొందరు నివాసం ఉంటుండగా, మరికొందరు బెంగళూరు, చెన్నై, అమెరికా తదితర ప్రాంతాల్లో ఉంటున్నారు. వీరిలో ఇప్పటికే చాలామంది వారి ప్లాట్లను ఇతరులకు అమ్మేయడంతో అపార్ట్‌మెంట్లు, ఆసుపత్రుల నిర్మాణం చేపట్టారు. ప్లాట్లు అమ్మకుండా బయటి ప్రాంతంలో ఉన్న యజమానులు తర్వాత వచ్చి నిర్మాణం చేస్తుంటే అక్రమార్కులు అడ్డుకుంటున్నట్లు చెబుతున్నారు. కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న ప్లాట్లను తిరిగీ ఇతరులకు అలాట్‌మెంట్ పేరుతో అమ్మేస్తూ, సొమ్ము చేసుకుంటున్నట్లు ఆ శాఖాధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. తిరుపతి రోడ్డులోని సొసైటీ లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న పాట్లను అంచెలంచెలుగా అయిన వారికి అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మదనపల్లెలో కాకుండా బయటి ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. కమ్యూనిటీ అవసరాల కోసం వదిలిన స్థలాలే కాదు.. ఇదివరకే సభ్యులకు కేటాయించిన ప్లాట్లను కూడా అమ్మేస్తున్నారు. బయటి ప్రాంతాల్లో ఉన్న యజమానులు తర్వాత తెలుసుకుని లబోదిమంటూ అధికారులను ఆశ్రయిస్తున్నారు. అలాగే బినామీ పేర్లతో కూడా కొన్ని ప్లాట్లు కేటాయించి, తిరిగీ వాటిని ఇతరులకు అమ్మేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో సొసైటీ ఎన్నికలు జరిగితే అక్రమాలన్నింటికీ చెక్ పడుతుందని అందరూ భావిస్తున్నారు.



మదనపల్లెలోని సహకార శాఖ డివిజన్ కార్యాలయం

# ధాన్యం ధర.. ఢమాల్

- క్వింటాకు రూ.500 తగ్గింపు
- ఆందోళనలో రైతులు

పోరుమామిళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి.. రేయనక పగలనక కంటికి రెప్పలా పంట పండిస్తే.. తీరా పంట చేతికి వచ్చే సమయానికి ఒక్కసారిగా ధర పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరి సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అసలే వర్షాకాలం కావడంతో పండించిన పంటను అమ్ముకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిచిందని, నాణ్యత లేదని రకరకాల సాకులు చూపుతూ వ్యాపారులు, దళారులు ఇష్టమొచ్చిన ధరకు అడుగుతున్నారు. అమ్మితే అమ్మండి, లేదంటే ఉంచుకోండంటూ తెగేసి చెబుతున్నారు. దీంతో ధాన్యాన్ని నిల్వ ఉంచుకోలేక.. దళారుల చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు దాదాపు కొన్ని వందల ఎకరాల్లో వరి పైరు నేలకొరిగి నీట మునిగింది. దీంతో సగానికి పైగా దిగుబడి పడిపోవడంతో దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారు.

పోరుమామిళ్ల మండలంలో దాదాపు 2వేల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. పోరు మామిళ్ల, కవలకుంట్ల, బుచ్చంపల్లె, టేకూరుపేట, సిద్దవరం, క్రిష్ణంపల్లె, గానుగపెంట, దమ్మనపల్లె, చల్లగిరిగెల, రంగసముద్రం ప్రాంతాల్లో వరి పైరును రైతన్నలు ఎక్కువగా సాగు చేశారు. ఎకరాకు దాదాపు 30వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. 40 క్వింటాళ్ల దిగు బడి వస్తుందని ఆశించారు. అయితే 20 లేదా 30 క్వింటాళ్లు మాత్రం దిగుబడి రావడంతో రైతులు డీలా పడిపోయారు. ఇక ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని తోకలపల్లె, దమ్మనపల్లె, పోరుమామిళ్ల తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి సగానికి పైగా వరి పైరు నీటిలో మునిగిపోయింది. దీంతో ఎక్కడ మోసులొస్తాయని ఆందోళనతో రైతులు పైరు కోసి అమ్మకాలు మొదలు పెట్టారు. ఇదే అదునుగా వ్యాపారస్తులు, దళారులు వర్షానికి ధాన్యం తడిచిందని, నాణ్యత లేదని సాకులు చెబుతూ ధరలు బాగా తగ్గించారు. గత ఏడాది క్వింటా రూ.2300 ధర పలికితే ఈ ఏడాది రూ.1750 ధర పలుకు తోంది. క్వింటాకు రూ.500 పడిపోవడంతో తీవ్ర నిరాశకు గురవు తున్నారు. దీంతో ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో రైతులు పండించిన పంటను వ్యాపారులు చెప్పిన ధరకే తెగనమ్ముకుంటున్నారు.


అమ్మకానికి రాశిగా పోసిన వరిధాన్యం


తడిసిన వరి పైరు చూసి ఆవేదనలో శ్రీనివాసులు

**నీటిలో మునిగిపోయి నష్టపోయాం**

ఇటీవల కురిసిన వర్షానికి వరి పైరు పూర్తిగా నీటిలో మునిగిపోయింది. సగానికి పైగా వరి ధాన్యం నీటిలోనే మునిగిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది ప్రభుత్వం వరి సాగు చేసిన రైతులను ఆదుకోవాలి.

- శ్రీను, దమ్మనపల్లె

**అకాల వర్షం నట్టేట ముంచింది**



ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు తూము ఎత్తడంతో కాల్వల ద్వారా నీరు పైరులో చేరి మొత్తం మునిగిపోయింది. ధర కూడా లేకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం వరి సాగు చేసిన రైతులను ఆదుకోవాలి.

- గురు శేఖర్, రైతు

## డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తులు

సీకేదిన్నె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఉపరవాణా కమిషనర్ ఎం.వీ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్యంతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థికసాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడమే దీని ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ చొప్పున మంజూరు చేసేందుకు నిర్ణయించారన్నారు. ఈనెల 23 సాయంత్రం అయిదు గంటల లోపు ఆసక్తిగల అభ్యర్థులు డీపీఆర్ కాపీలను, ఇతర అటాచ్‌మెంట్లను వైఎస్ఆర్ కడప జిల్లా ఉపరవాణా కార్యాలయంలో ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందుకు కావాల్సిన అర్హతలు ఆసక్తిగల సంస్థ ఎంజీవో, ట్రస్ట్, కోఆపరేటివ్ సొసైటీ, తయారీదారుడు, పార్శ్వఅయి ఉండాలన్నారు. ఎన్జీవో అయితే తప్పనిసరిగా దర్పం పోర్టల్‌లో రిజిస్టర్ అయి ఉండాలన్నారు. ఈ సంస్థ గత మూడు సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్స్, టర్నోవర్ సర్టిఫికెట్లు అందించాలన్నారు. ఇటువంటి సంస్థకు సొంతంగా లేదా కనీసం పది సంవత్సరాల లీజు కలిగిన రెండు ఎకరాల స్థలం, సిమ్యులేటర్, ట్రైనింగ్ వాహనాలు, వర్క్‌షాపు, రెండు క్లాస్‌రూమ్స్, ఇంటర్నెట్, తదితర సదుపాయాలు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు రవాణా శాఖ వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు.

## విద్యార్థి ఆత్మహత్య

పోరుమామిళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీకి చెందిన ఉదయకిరణ్ (17) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నెల్లూరు జిల్లాలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం డిప్లమా చదువుతున్న ఉదయ్‌కిరణ్ బుధవారం రాత్రి కళాశాల గదిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ట్యాబ్ విషయంలో ప్రొఫెసరు మందలించిందని మనస్థాపానికి గురై ఈ ఘటనకు పాల్పడినట్లు సమాచారం. కాగా, ఉదయ్‌కిరణ్ తండ్రి చనిపోవడంతో తల్లి భాగ్యక్ష్మి ఒక్కగానొక్క కుమారుడిని ఎంతో కష్టపడి చదివించేంది. కొడుకు మృతి విషయం తెలిన ఆమె కన్నీటిపర్యంతమైంది.

## రేపు కడపలో స్కేటింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 18న శనివారం స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ది రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఇజ్రాయెల్ వెల్లడించారు. కాకినాడలో నవంబరు 1వ తేదీ నుంచి 5 వరకు జరగనున్న 37వ అంతర్‌జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీల నేపథ్యంలో క్రీడాకారులను ఎంపిక చేసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18న ఉదయం 6గంటలకు యోగివేమన యూనివర్శిటీ లో రోడ్‌రేస్ పోటీలు ఉంటాయన్నారు. అదేరోజు 9గంటలకు కడప నగర డీఎస్ఏ మైదానంలో గల రింక్‌లో ఎంపిక పోటీలు జరగనున్నాయన్నారు. ఇందులో పాల్గొనే బాలబాలికలు ఏజ్ గ్రూపు వివరాలిలా.. 4 నుంచి 6 సంవత్సరాలు, 6 నుంచి 8, 8 నుంచి 10, 10 నుంచి 12, 12 నుంచి 15, 15 నుంచి 18 సంవత్సరాల్లోపు వారు పాల్గొనేందుకు అర్హులన్నారు. జిల్లాలోని ఔత్సాహిక స్కేటింగ్ క్రీడాకారులు తప్పక పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి తద్వారా అంతర్‌జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక కావాలని కోరారు.

## న్యాయం చేయాలని కోరితే నోటీసులా?

- ఆర్డీఓను ప్రశ్నించిన రైతులు


పులివెందుల ఆర్డీఓ కార్యాలయం ఎదుట నోటీసులు అందుకున్న రైతులు

పులివెందుల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా న్యాయం చేయాలని కోరితే నోటీసులు ఇవ్వడం ఏమిటని వేముల మండలం చింతలజూటూరు గ్రామ రైతులు ఆర్డీఓను ప్రశ్నించారు. గురువారం ఆర్డీఓ చిన్నయ్యను రైతులు కలిసి తమ ఆవేదనను వెలిబుచ్చారు. పలువురు రైతులు మాట్లాడుతూ బెంగళూరు టు విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా వేముల మండలం చింతలజూటూరు గ్రామం పరిధిలో పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) ఉందన్నారు. ఆ కెనాల్‌పై అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మిస్తున్నారన్నారు. అయితే బ్రిడ్జి కింద నుంచి పొలాలకు వెళ్లేందుకు వ్యవసాయ యంత్రాలు పోయేందుకు వీలుండదన్నారు. ఈ సమస్య గురించి ఆర్డీఓ చిన్నయ్యను మూడు నెలల కిందట కలిసి వినతిపత్రం సమర్పించామన్నారు. ఆర్డీవో సమస్యకు పరిష్కారం చూపకుండా న్యాయం చేయాలన్న రైతులకే నోటీసులు పంపించారన్నారు. అలాగే డీబీఎల్ కంపెనీ చేస్తున్న అక్రమంగా మట్టి తరలింపు గురించి ఆర్డీఓకు వివరించామన్నారు. ఇందుకు ఆర్డీఓ స్పందిస్తూ కెనాల్ వద్ద జరుగుతున్న పనులను మళ్లీ ఒకసారివచ్చి చూసి పరిష్కరిస్తామని చెప్పారన్నారు. అలాగే మట్టి తరలింపుపై సంబంధిత అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో చింతలజూటూరు, పెద్దజూటూరు, గొల్లలగూడూరు, పెర్నపాడు రైతులు, మద్దతుగా బీజేపీ, టీడీపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## పత్రికా ప్రకటన

వై.యస్.ఆర్. కడప, జిల్లా ప్రజాపరిషత్ ఆధీనములో ఉన్న నాగరాజుపేట ఏరియాలోని ఆహార భవన్ ప్రక్కనున్న దాదాపు **"2.00" యకరములు మరియు పెద్ద పోస్టాఫీసు ఎదురుగా ఉన్న స్థలము "7" సెంట్లు విస్తీర్ణంగల స్థలంనందు ప్రభుత్వ / ప్రభుత్వ రంగ / ప్రైవేటు బ్యాంక్‌లకు గాని, పేయింగ్ గెస్ట్ హాస్టల్‌కు గాని, ప్రైవేట్ / కార్పొరేట్ పాఠశాలలకు గాని మరియు ఏ ఇతర ప్రధాన వాణిజ్య వ్యాపారముల కొరకు భవన నిర్మాణము అవసరమున్నచో వారికి వారు కోరిన విధముగా నిర్మించి నెలసరి అద్దెకు ఇవ్వబడును.** ఆసక్తిగల వారు ఈ క్రింది అడ్రసు వారిని సంప్రదించగలరు.

సం/- ముఖ్య కార్యనిర్వహణ అధికారి
జిల్లా ప్రజా పరిషత్
వై.యస్.ఆర్. కడపజిల్లా
సెల్ నెం. 63036 76811, 99635 91748

## మెరుగైన జీవనానికి ఫుడ్ టెక్నాలజిస్టులు ప్రయత్నించాలి



ఉత్పత్తులలో కల్తీలు కనుగొనే విధానాన్ని వివరిస్తున్న విద్యార్థినులు

పులివెందుల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మెరుగైన ఆహార ఉత్పత్తులు, పౌష్టికాహారం ద్వారా మెరుగైన జీవితాన్ని అందించడానికి ఫుడ్ టెక్నాలజిస్టులు ప్రయత్నించాలని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవ సూచించారు. గురువారం ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఆహార ఉత్పత్తుల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. డీన్ మాట్లాడుతూ ప్రస్తుతకాలంలో పోషకాహార లోపం, ఊబకాయం వంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతు న్నారన్నారు. ఇలాంటి సమస్యలను అధిగమించడానికి ప్రతి ఒక్కరు రోజూ సమతుల్య ఆహారం తీసుకోవాలని చెప్పారు. బెంగుళూరు గ్లోబల్ గ్రీన్‌కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రమోహన్, ప్రొద్దుటూరు శ్రీనిధి డెయిరీ క్వాలిటీ డిపార్ట్‌మెంట్ హెడ్ జె.చంద్రశేఖర్, పులివెందుల వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ లక్ష్మీపతి హాజరై మాట్లాడారు. ఆహార భద్రత, ఆహార పదార్థాలను నిల్వ ఉంచడానికి కొత్తపద్ధతులను కనుగొనాలని, పరిశోధన దృక్పథంతో ఆలోచించాలని విద్యార్థులకు సూచించారు.

అనంతరం నాల్గవ సంవత్సరం విద్యార్థులు తమ ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్ ప్రోగ్రాంలో తయారుచేసిన ఆహార ఉత్పత్తులు ప్రదర్శించారు. మూడవ సంవత్సరం విద్యార్థులు పసుపు, కారం, ఉప్పు, మిరియాలు, కాఫీ పౌడర్, వంట నూనె, పాలు, పెరుగు, పన్నీర్ వంటి ఆహార పదార్థాలలో కల్తీని అతి సులువుగా కనుగొనే పద్ధతులను ప్రదర్శించారు. అలాగే సాహిత్య పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్టూడెంట్ యాక్టివిటీ అధికారి డాక్టర్ కీర్తిరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ జయమ్మ, డాక్టర్ రాజేష్, ఇంజనీర్ నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకీర్ బాష, బి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

## బాలవికాస్ హైస్కూల్‌కు జాతీయస్థాయి ర్యాంక్


అవార్డు స్వీకరిస్తున్న బాలవికాస్ స్కూల్ కరస్పాండెంట్ గంగయ్య

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా నిర్వహించిన జాతీయ సర్వేలో కడప బాలవికాస్ హైస్కూల్ విశిష్ట ర్యాంకులు సాధించింది. న్యూఢిల్లీలో జరిగిన అవార్డు కార్యక్రమంలో బడ్జెట్ పాఠశాలల కేటగిరీలో ఈ పాఠశాల జిల్లా స్థాయిలో 2వ, రాష్ట్రస్థాయిలో 5వ, జాతీయస్థాయిలో 26వ ర్యాంకు పొందింది. డైరెక్టర్ గంగయ్య, కరస్పాండెంట్ సుబ్బరాయుడు అవార్డును స్వీకరించి, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## టెండరు ప్రకటన
## జిల్లా ప్రజాపరిషత్తు కార్యాలయం, కడప.

ఉత్తర్వు ఆర్.సి. నెం. ఎ7/2865/2024 తేది:16.10.2025

జిల్లా ప్రజా పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్, వేంపల్లిలోని 14 రూములు యందు వ్యాపారము చేసుకొనుటకుగాను ఆసక్తిగల ఏజన్సీలు/సంస్థలు/వ్యక్తుల నుండి టెండరు దరఖాస్తులు కోరబడుచున్నవి.

1) దరఖాస్తు ఫారములు **తేది : 17-10-2025 నుండి తేది : 24-10-2025 వరకు** కార్యాలయ పని దినములలో ఉదయం గం. 10.30 ల నుండి సా.గం.05.00 ల వరకు రూ. 2000/- ల రుసుము చెల్లించి పొందగలరు.

**దరఖాస్తు ఫారములు అమ్మబడు ప్రదేశము :** మండల ప్రజా పరిషత్ కార్యాలయము, వేంపల్లి.

2) పూర్తి చేసిన దరఖాస్తు ఫారములను సీల్డ్ కవర్లో ఉంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయము, వేంపల్లిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీల్డ్ టెండరు బాక్సు లోపల **25-10-2025వ తేదిన ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నము 2.00 గంటల లోపు** వేయవలెను.

**3) 25-10-2025వ తేదీన మధ్యాహ్నము 3.00 గంటలకు** టెండరు దారుల సమక్షములో టెండరు బాక్సు తెరువబడును.

| | రూము నెంబరు | గది విస్తీర్ణం చదరపు అడుగులలో | కనీస అద్దె మొత్తము | ధరావత్తు మొత్తము రూ.లు | అగ్రిమెంటు కాలపరిమితి |
|---|---|---|---|---|---|
| Ground Floor | 1 | 284 | 20700 | 200000 | 3 సం. |
| Ground Floor | 31,32,33,34 | 110 | 5100 | 100000 | 3 సం. |
| Ground Floor | 35 | 154 | 6500 | 100000 | 3 సం. |
| First Floor | 2,3,4 | 150 | 4000 | 50000 | 3 సం. |
| First Floor | 7&8 (ఒకే రూముగా కలిపి) | 462 | 10000 | 100000 | 3 సం. |
| First Floor | 9,10,11,12 | 220 | 6000 | 50000 | 3 సం. |

సం/- ముఖ్య కార్యనిర్వహణాధికారి
జిల్లా ప్రజా పరిషత్తు
వై.యస్.ఆర్. కడపజిల్లా

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి : ఎంపీ

పులివెందుల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడాన్ని ఆపేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పులివెందులలోని వైఎస్సార్ ఆడిటోరియంలో ప్రజావైద్యం ప్రజల హక్కు అంటూ కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ సంతకం పెట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే వైసీపీ గ్రామ, వార్డు కమిటీల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు సిద్ధమైందన్నారు. వారికి అనుకూలమైన వారికి కట్టబెట్టేందుకు ఈ విధానాన్ని ముందుకుతెచ్చారన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హత్య సినిమా యూనిట్ సభ్యులకు సునీల్ యాదవ్ లీగల్ నోటీసులు

- వారం రోజుల్లో సమాధానం చెప్పకుంటే..
- ఒక్కొక్కరిపై రూ.5కోట్లకు పరువునష్టం దావా

పులివెందుల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హత్య సినిమా డైరెక్టర్ శ్రీవిద్య బసవ, ప్రొడ్యూసర్ ఎస్.ప్రశాంత్, వైసీపీ సోషల్ మీడియా వ్యక్తి ఎస్.పవన్‌కుమార్‌లకు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-2 నిందితుడు సునీల్‌యాదవ్ లీగల్ నోటీసులు పంపించారు. 22 మార్చి 2025న విడుదలైన హత్య సినిమాలో తన తల్లికి సంబంధించిన పాత్ర అసభ్యకరంగా ఉందని సునీల్ యాదవ్ అప్పట్లోనే పేర్కొన్నారు. దీనిపై సోషల్ మీడియాలో పోస్టు చేసిన పవన్‌కుమార్‌పైన, చిత్ర డైరెక్టర్, ప్రొడ్యూసర్లపై పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై అదేరోజు పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే ఈ కేసుకు సంబంధించి వీరు స్టే తెచ్చుకున్నారు. దీనితో ఈ ముగ్గురికి సుప్రీంకోర్టు లాయర్ టీఎల్ నయన్‌కుమార్‌రెడ్డి ద్వారా సునీల్‌యాదవ్ లీగల్ నోటీసు పంపించారు. ఈ నోటీసు బుధవారం వీరికి అందింది. తన తల్లి పాత్రను అసభ్యకరంగా చిత్రీకరించారని, దీనికి ఏడు రోజుల్లో సమాధానం చెప్పాలని నోటీసులో పేర్కొన్నారు. ఏడు రోజుల్లో సమాధానం చెప్పకపోతే ఒక్కొక్కరిపైన రూ.5కోట్లకు పరువునష్టం దావా వేస్తానని అందులో తెలిపారు. దీనిపై గురువారం సునీల్‌యాదవ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. వారికి నోటీసులు ఇచ్చినట్లు ధ్రువీకరించారు.


## సూపర్ జీఎస్టీతో ప్రజలకు ఎంతో మేలు


ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వీర్రాజు

కడప నాగరాజుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.వీర్రాజు అన్నారు. గురువారం ఆయన ప్రభుత్వ గెస్ట్ హౌస్ సమీపంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గడంతో వాహనాలపై ఆర్థికభారం తగ్గిందన్నారు. మధ్యతరగతి ప్రజలు వాహనాలు కొనుగోలు చేసేందుకు ఇది మంచి పరిణామమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనంపై రూ.10వేలు, ఆటో రిక్షాపై రూ.20వేలు, గూడ్స్ వాహనాలపై రూ.50వేల వరకు తగ్గింపు వచ్చిందన్నారు. ర్యాలీలో వాహనాల డీలర్లు, రవాణా సంఘాలు, రవాణా కంపెనీల వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ విజయభాస్కర్ ఏఎంవీఐ లక్ష్మీప్రసన్న, రవికుమార్, అసిస్టెంట్ కమిషనర్ నారాయణరెడ్డి, డిప్యూటీ స్టేట్ కమిషనర్ వంశీకృష్ణ, జీఎస్టీఓ మణికంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

## మఠాధిపతి ఎంపికను ధార్మిక పరిషత్ నిర్ణయిస్తుంది


మాట్లాడుతున్న బ్రహ్మపథం పీఠాధిపతి క్రిష్ణమాచార్య

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్ర స్వామి మఠానికి సంబంధించి మఠాధిపతి నిర్ణయం ఈనెల 28న ధార్మిక పరిషత్ కమిటీ ద్వారా జరుగుతుందని బ్రహ్మపథం పీఠాధిపతి క్రిష్ణమాచార్య అన్నారు. ఆయన గురువారం బ్రహ్మంగారి మఠంలోని పార్కులో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం చాలాప్రాముఖ్యత చెందిన మఠం అని, ఇప్పటి వరకు 8 తరాలు మారాయని, 11 మంది పీఠాధిపతులు మారారన్నారు. నాలుగు సంవత్సరాల కిందట మఠాధిపతి వెంకటేశ్వరస్వామి శివైక్యం చెందిన తరువాత మఠాధిపతి ఎంపిక విషయం కొన్ని అనివార్య కారణాల వల్ల ఆగింద న్నారు. దీనిపై కొంతమంది పీఠానికి, మఠానికి తేడా తెలియని వ్యక్తులు కూడా మాట్లాడడం బాధాకరమన్నారు. మఠాధి పతి ఎంపిక త్వరలోనే ధార్మిక పరిషత్ నిర్ణయిస్తుందని అన్నారు. 28న జరగ బోయే సమావేశానికి గ్రామ ప్రజలు, పెద్దలు మఠం గురించి తెలిసిన ఆచార సాంప్రదాయాలను ధార్మిక పరిషత్‌కు లిఖితపూర్వకంగా తమ అభిప్రాయాలను అందజేయవచ్చన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటిన కేజీబీవీ విద్యార్థులు


పతకాలు సాధించిన అట్లూరు కేజీబీవీ విద్యార్థులు

అట్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో అట్లూరు కస్తూర్బా గురుకుల కళాశాల, పాఠశాల విద్యార్థులు పాల్గొని వెండి, పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రత్యేక అధికారి ఫణిశ్రీ తెలిపారు. బాక్సింగ్ క్రీడల్లో చైతన్యలక్ష్మి వెండి పతకం సాధించిందన్నారు. అలాగే శిరీషా, హిమశైలజ, వెంకటేశ్వరి, క్రిష్ణకావ్య రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. అలాగే ఉషూ క్రీడల్లోఝాన్సీ, హిమశైలజ. వెండి పతకం సాధించారు. అండర్ -17 ఉషూ క్రీడల్లో తనూజా రజిత పతకం సాధించినట్లు తెలిపారు. వీరిని పీఈటీ ఉపాధ్యాయురాలు ప్రమీల అభినందించారు.

## పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

● విద్యార్థి సంఘాలు డిమాండ్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐదవ తరగతి చ దువుతున్న గిరిజన విద్యార్థి విక్షిత్‌నాయక్‌పై దాడి చేసిన నగర శివారులోని ప్రైవేటు పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండు చేశాయి. ఈ ఘటనకు నిరసనగా విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి-యువజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ విద్యార్థిపై దౌర్జన్యం చేయడం అప్రజాస్వామికమని, అలాగే వి ద్యార్థి తల్లిదండ్రులను కులంపేరు తో దూషించడం దారుణమన్నారు. ఆందోళనపై స్పందించిన డీఈవో షంషుద్దీన్ సంబంధిత పాఠశాలలకు నోటీసులు జారీ చేసి గుర్తిం పు రద్దు కోసం పైఅధికారులకు సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చా రు. ఆందోళనలో పీడీఎస్‌యు రా ష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డీఎం ఓబులేస్‌యాదవ్, ఆర్ఎంపీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎన్ రాజా, ఏఐఎస్‌బి జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, పీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

## నేడు సర్వసభ్య సమావేశం

వల్లూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 17వ తేదీ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఘురాం తెలిపారు. మండల అధ్యక్షురాలు మల్లీశ్వరి అధ్యక్షతన ఈ స మావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పాల్గొంటారని, ఉదయం 10గంటలకు ఎంపీడీవో సమావేశ మందిరంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని సూచించారు.

## సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు

చెన్నూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో సొంతంగా నిధులు సమీకరించి అభివృద్ధికి తోడ్పడే విషయమై ఈనెల 17, 18వ తేదీల్లో రెండురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు చెన్నూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిధుల సమీకరణ ఏవిధంగా చేసుకోవాలి, పంచాయతీలో ఉన్న వనరులు అందుకు తగ్గ ప్రణాళికలు వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి

వేంపల్లె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, తగినంత నీరు తీసుకుంటూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ యూనిట్ 14 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.తిరుపతిరెడ్డి సూచించారు. గురువారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ప్రపంచ ఆహార దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితరం జీవన విధానంలో పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడి సంప్రదాయ సమతుల్యమైన ఆహారం తీసుకోవడం లేదన్నారు. దీంతో అనేక అనారోగ్య సమస్యల బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ దీప్తి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



## రవాణా, లాజిస్టిక్ రంగానికి జీఎస్టీ సూపర్ గిఫ్ట్


ర్యాలీ నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారులు

కమలాపురం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రవాణా, లాజిస్టిక్ రంగాలకు జీఎస్టీ 2.0 ద్వారా సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని ఆర్టీవో ప్రసాద్ తెలిపారు. గురువారం జీఎస్టీ, రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక మూడురోడ్ల కూడలి నుండి హెచ్‌పీ పెట్రోలు బంకు వరకు సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ వల్ల జీఎస్టీ సంస్కరణలు, రవాణా లాజిస్టిక్ రంగానికి మరింత బలం చేకూరుతుందన్నారు. అలాగే తక్కువ ఖర్చులు, వేగవంతమైన వృద్ధి, మెరుగైన ఇన్‌పుట్ క్రెడిట్ ప్రయోజనాలు కలుగుతాయన్నారు.

### తగ్గిన రేట్లను ప్రదర్శించాలి

పులివెందుల టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి దుకాణదారుడు జీఎస్టీ శాతం తగ్గిన నేపథ్యంలో వస్తువుల రేట్లను ప్రదర్శించాలని వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి సూచించారు. పులివెందులలో రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై బైక్ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు పూల అంగళ్ల సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పులివెందుల ఎంవీఐ ప్రసాద్, సీఐ సీతారామిరెడ్డి, జీఎస్టీ అధికారులు, పోలీసు, ఎంవీఐ సిబ్బంది పాల్గొన్నారు.

## 'పెండింగ్ పనుల పూర్తికి టీడీపీ కట్టుబడి ఉంది'

వేంపల్లె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పెండింగ్‌లో ఉన్న వేంపల్లె రోడ్లు పూర్తి చేయించేందుకు టీడీపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి తెలిపారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేంపల్లె ప్రధాన రహదారిలోని సిమెంట్ రోడ్డు పనులను ఆర్అండ్‌బీ అధికారుల ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. ఈ పనులను గురువారం ఆర్అండ్‌బీ ఈఈ మాధవి, డీఈ వేణుగోపాల్, ఏఈ మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. త్వరగా పూర్తిచేయించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి, మైనార్టీ సెల్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మాజీ గ్రంథాలయ చైర్మన్ బాలస్వామిరెడ్డి, తక్కెళ్ల షరీఫ్, మహమ్మద్, మల్లంగి పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పరుల సేవే పరమధర్మం : వీసీ


నాగరాజును సత్కరిస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పరుల సేవ చేయడమే పరమధర్మమని, ఇతరుల బాధను అర్థం చేసుకునే వాడే పరమభక్తుడు అన్న వేమన మాటలను స్ఫూర్తిగా తీసుకోవాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. గురువారం అన్నామాచార్య సెనేట్ హాల్లో జరిగిన వైవీయూ ఎన్ఎస్ఎస్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా వినోదంలో మునిగిపోయిన యువతకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆదర్శమన్నారు. ప్రొఫెసర్ మధు బొటానికల్ గార్డెన్‌లో అడవిని నిర్మించడాన్ని, యూనివర్సిటీ ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగరాజును ప్రశంసించారు. అనంతరం అవార్డు గ్రహీతలను సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

## ఆహార ఉత్పత్తిలో ఆధునిక మార్గాలు అన్వేషించాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆహార ఉత్పత్తుల్లో ఆధునిక మార్గాలను అన్వేషించాలని వైవీయూ వీసీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. గురువారం సైన్స్ బ్లాక్‌లో వరల్డ్ ఫుడ్ డే కార్యక్రమాన్ని ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రియాజున్నీసా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆహార వృథాను అరికట్టాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. డీన్ ప్రొఫెసర్ కేఎస్ చిదంబరమూర్తి ప్రాథమిక ఆహార అసరాలు, సరైన పోషకాహారం, యువతలో అవగాహన వంటి అంశాలపై వివరించారు. విద్యార్థులు సంప్రదాయ, పోషకాహార వంటకాలను ప్రదర్శించి, ఆహార వ్యర్థాన్ని తగ్గించే ర్యాలీ, సుస్థిరాహార అలవాట్లను ప్రోత్సహించే కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి


సమస్యలు వింటున్న రిటైర్డ్ జడ్జి

కడప నాగరాజుపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస అంజనేయ మూర్తి అన్నారు. గురువారం కడపలోని విశ్రాంత ఉద్యోగుల భవనం ఆవరణంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్థిక సభ్యుడు మధుకుమార్, సాంకేతిక సభ్యుడు శ్రీనివాసబాబు, స్వతంత్ర సభ్యురాలు విజయలక్ష్మి, విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీర్ హరిసేవ్యానాయక్, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

## నేడు మహబూబ్ సుబహాని ఉర్సు

కమలాపురం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పడమటివీధిలో వెలసిన హజరత్ మహబూబ్‌సుబహాని, ఖుత్బార బ్బాని, అబ్దుల్ ఖాదర్ జిలానీ, దస్తగిరిస్వామి ఉర్సు శుక్రవారం రాత్రి నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఉర్సు జెండాను పట్టణ పురవీధులగుండా ఊరేగింపు, అనంతరం గంధం, ప్రత్యేక ఫాతెహా నిర్వహిస్తామన్నారు.



## పిల్లల సమస్యలపై అవగాహన అవసరం

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వాణి, లీగల్ ఆఫీసర్ సునీతరాజు తెలిపారు. స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌమార దశ పిల్లలు తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, దురలవాట్ల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని, అప్పుడే అనుకున్న గమ్యాన్ని చేరుకోగలరని, మంచి చెడును గ్రహిస్తూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజరు సరిత, మాబుచాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### జీవన ఎరువుల వినియోగంపై అవగాహన

సింహాద్రిపురం... సీకేదిన్నె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవన ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త శిల్పకళ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం జీవన ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు అధిక దిగుబడి కోసం విచక్షణారహితంగా పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడడం వలన నేల నిస్సారమవుతుందన్నారు. అలాగే మండలంలోని లింగారెడ్డిపల్లెలో జీవన ఎరువుల వాడకంపై ఏరువాక కేంద్రం సమన్వయకర్త క్రిష్ణప్రియ రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు సురేష్‌కుమార్‌రెడ్డి, ఏరువాక కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### 'టీడీపీలో మైనార్టీలకు గుర్తింపు లేదు'

కమలాపురం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కడప టీడీపీలో మైనార్టీలకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని 36వ డివిజన్ ఇన్‌చార్జ్ మాబుల్లా ఆరోపించారు. ఈ మేరకు గురువారం 31, 32, 35, 36, 37, 38, 39 డివిజన్ల టీడీపీ ఇన్‌చార్జిలు, ముస్లిం నాయకులు స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సంపాదించుకున్న ఆస్తులను కాపాడుకునేందుకు టీడీపీలో చేరిన కొందరు కార్పొరేటర్లకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వాపోయారు. మరో నియోజకవర్గ సమస్యలలో జోక్యం చేసుకోలేమని, ఆ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించుకోవాలని పుత్తా సూచించారు. అంతేకాక ఈ సమస్యలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళతానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆలీఖాన్, రఫిక్, ఆలీఖాన్, మహ్మద్ షేక్ వాయిద్ ఇబ్రహీం, అహ్మద్, ఖాదర్‌బాషా, రాఘవరెడ్డి, శివశంకరరెడ్డి పాల్గొన్నారు.

### ఆడపిల్లలను సంరక్షించి చదివించాలి

వేంపల్లె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను సంరక్షించి చదివించాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫిఉన్నీసా బేగం అన్నారు. గురువారం మండలంలోని కత్తలూరు సచివాలయ పరిధిలోని ఏపీఆర్ఎస్ఎమ్ బాలికల (ఉర్దూ) పాఠశాలలో సేవ్ గర్ల్‌చైల్డ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధించి ఆడపిల్లల భ్రూణహత్యలను నివారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుగుణమ్మ, సీహెచ్‌వో వెంకటరత్నం, సూపర్వైజర్ అంకయ్య, స్టాఫ్ నర్స్ అరుణ, సీహెచ్‌వో రమాదేవి, ఏఎన్ఎమ్ స్వర్ణ, ఆశాలు పాల్గొన్నారు.

### నిరసనలను అడ్డుకోవడం దుర్మార్గం

కడప నాగరాజుపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా శాంతియుత నిరసన కొనసాగిస్తామని చెప్పినా పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ అన్నారు. గురువారం స్థానిక ఐటీఐ సర్కిల్‌లోని గాంధీ విగ్రహం వద్ద సీపీఎం నేతలు నిరసనకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు తమ పార్టీ జెండాలు, బ్యానర్‌ను లాక్కోవడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మద్యం షాపుల తనిఖీ

కడప క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని పలు మద్యం షాపులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేశారు. ఇటీవల మొలకల చెరువులో నకిలీ మద్యం పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు ప్రభుత్వం ఆవిష్కరించిన ఎక్సైజ్ సురక్ష యాప్‌తో మద్యం బాటిళ్లను పరిశీలించారు. స్టాకు వివరాలపై ఆరా తీశారు. దుకాణాల్లో నకిలీ మద్యం, లేదా ఇతర రాష్ట్రాల మద్యం బాటిళ్లు ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

## భద్రతా ప్రమాణాలు పాటించాలి : ఆర్డీవో

పులివెందుల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): టపాసుల విక్రయ కేంద్రాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆర్డీవో చిన్నయ్య తెలిపారు. టపాసుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు గురువారం మధ్యాహ్నం లయోలా డిగ్రీ కళాశాల సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే టపాసుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో విక్రయ కేంద్రాల వద్ద తగిన భద్రత సూచనలను పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, అర్బన్ సీఐ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పీఎస్ హెచ్‌ఎంకు సన్మానం

పోరుమామిళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం ఆదర్శ ప్రాథమిక పాఠశాల పీఎస్ హెచ్‌ఎం రామచంద్రారెడ్డిని బదిలీ సందర్భంగా ఘనంగా సన్మానించారు.







## తగ్గిన జీఎస్టీతో వాహనదారులకు లబ్ధి


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీవో మనీషా

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ సవరణల వలన వాహనదారులకు లబ్ధిచేకూరుతున్నదని వినియోగదారులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రొద్దుటూరు ఆర్టీవో మనీషా పేర్కొన్నారు. గురువారం జీఎస్టీపై అవగాహన కల్పించేందుకు రవాణా శాఖ ఆధ్వర్యంలో పాత బస్టాండు నుంచి పుట్టపర్తి సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాహన ధరలు తగ్గిన జీఎస్టీతో లబ్ధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీటీవో రాజానరసింహారెడ్డి, ఏసీటీవో వెంకటరామయ్య, ఎంవీఐ నాయక్, ఏఎస్‌ఐలు బాష, నరసింహులు పాల్గొన్నారు.

**బద్వేలులో:** ప్రజలు ఆర్థికంగా వస్తు సేవలపై తగ్గింపు పొందాలంటే జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రావు అన్నారు. గురువారం ఆర్టీవో కార్యాలయం నుంచి ప్రధాన రహదారుల వెంట సూపర్ జీఎస్టీపై అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించి ఆర్థికాభివృద్ధి సాధించాలంటే జీఎస్టీ గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏసీటీవో విజయలక్ష్మి, డిసిటీవో శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్, డ్రైవింగ్ స్కూల్, బైక్ షోరూంల యాజమాన్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన

మైదుకూరు అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):ఇటీవల కాలంలో కల్తీమద్యంపై వస్తున్న వదంతుల నేపథ్యంలో ఎక్సైజ్ యాప్‌ను మొబైల్ ఫోన్లలో తప్పకుండా వాడుకోవాలని మైదుకూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ధీరజ్‌రెడ్డి పేర్కొన్నారు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌పై మైదుకూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను అందుబాటులోకి తెచ్చారని, ఈ యాప్‌ను సామాన్య ప్రజలు, వైన్ షాపు యజమానులు వారి వారి మొబైల్ ఫోన్లలో ఎక్కించుకోవడం ద్వారా మద్యం నాణ్యత తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ భారతి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

జమ్మలమడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జమ్మలమడుగులో గురువారం జరిగిన సమావేశంలో తాలూకా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా జి.రాజేంద్రకుమార్, సెక్రటరిగా పి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా వి.సుదర్శన్‌రెడ్డి, పి.ఇంతియాజ్, నారాయణరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా బి.లక్ష్మీదేవి, సృజన్‌కుమార్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రఘురాంయాదవ్, క్రిష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటు నమోదుకు యువత నడుంబిగించండి


ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): యువత ఓటు నమోదుకు నడుంబిగించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.త్రివిక్రంరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగమహేశ్వరరెడ్డిలు పేర్కొన్నారు. గురువారం ఇంటర్ విద్యార్థులతో శాంతినగర్‌లో ఇంటింటికి తిరిగి ఓటర్ల సర్వే నిర్వహించి ఓటు విలువ, బాధ్యత, ఎన్నికల్లో నైతికతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగిఉండాలన్నారు. ఈ సందర్భంగా సమాజ మార్పు కోరుతూ యువత ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు ప్రసంగించారు.

## విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి


రోడ్లను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సామాజిక సేవ చేయాలని ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రాజుపాలెం మండలం వెల్లాలలో వారం రోజులపాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. చివరి రోజు విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమాజం పట్ల అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వెల్లాల సంజీవరాయస్వామి ఆలయ చైర్మన్ గంగిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, ఈవో కేవీ రమణ, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అహ్మద్‌షరీఫ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే సేవాదృక్పథం కలిగిఉండాలి


పాఠశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని రాణితిరుమల దేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, కరస్పాండెంట్ తరుణేందుశేఖర్‌లు తెలిపారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తాళ్లమాపురంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గురువారం మొదటిరోజు స్వచ్ఛభారత్ ద్వారా ప్రభుత్వ పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వారం రోజులపాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.కొండారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం విజయకుమారి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మైలవరం ఎంపీడీవోగా సోమశేఖర్‌రెడ్డి

మైలవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మైలవరం ఎంపీడీవోగా సోమశేఖర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో బ్రహ్మంగారిమఠానికి బదిలీ కావడంతో సోమశేఖర్‌రెడ్డి ఇక్కడకు వచ్చారు. గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు.










## వివేకానంద సేవాశ్రమంలో అన్నవితరణ

కాశినాయన అక్టోబరు16(ఆంధ్రజ్యోతి) మండలంలోని సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో పిట్టిగుంట గ్రామానికి చెందిన ముత్తుముల పెద్ద మల్లారెడ్డి ప్రథమ వర్ధంతిని పురష్కరించుకొని గురువారం వృద్ధులకు పండ్లు పంపిణీతోపాటు అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు పి.రామక్రిష్ణారెడ్డి, నిర్వాహకరాలు రామతులసి వారి కుటుంబీకులు ముత్తముల క్రిష్ణారెడ్డి, మల్లీశ్వర్‌రెడ్డి, జంగం రెడ్డి పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

బి.కోడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకొనుటకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. శుక్ర, శనివారాల్లో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు సచివాలయ సిబ్బందికి శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు.

**ఖాజీపేటలో:** ఎంపీడీవో కార్యాలయంలో 17, 18 తేదీల్లో సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణ ఉంటుందని ఏవో వెంకటరమణ అన్నారు. సచివాలయ సిబ్బందికి శిక్షణ ఉంటుందన్నారు.

**కాశినాయనలో:** నర్సాపురం వెలుగు సభాభవనంలో సర్పంచ్‌లకు శిక్షణ ఉంటుందని ఎంపీడీవో మైథిలీరెడ్డి తెలిపారు. రెండు రోజుల శిక్షణ ఉంటుందన్నారు.

## విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న సుశాంత్ అనే విద్యార్థిని అదే పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు నారాయణ స్వామి వైరుతో బొబ్బలు వచ్చేలా కొట్టడం బాధాకరమని అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షులు అరవింద్, దేవాలు డిమాండ్ చేశారు. ఆ మేరకు గురువారం విద్యార్థులతో కలిసి పాఠశాల ఎదుటవారు ధర్నా నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ నేత గండి సునీల్ మాట్లాడుతూ విద్యార్థిని ఉపాధ్యాయుడు రక్తం వచ్చేలా కొట్టడం దారుణమన్నారు. సంబంధిత అధికారులు, అతనిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## డిగ్రీ కళాశాలకు ఎన్‌ఎస్‌ఎస్ అవార్డు

మైదుకూరు అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యోగివేమన విశ్వవిద్యాలయ స్థాయిలో ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ అవార్డుకు ఎంపికైంది. ఆమేరకు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డిలను వైవీయూ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్, రిజిస్ట్రార్ పి.పద్మలు మెమెంటోలు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించారు. తమ కళాశాల అవార్డుకు ఎంపిక కావడంపట్ల కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

## దస్తగిరిస్వామి పండుగ

దువ్వూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో గురువారం దస్తగిరిస్వామి పండుగను ఘనంగా నిర్వహించారు. పక్కీర్లతోటి డప్పులు వాయిస్తూ స్వామి ఊరేగింపును నిర్వహించారు. నిర్వాహకులు రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు.
















## రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

జమ్మలమడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం కడపజిల్లా కొండాపురం తదితర ప్రాంతాలకు చెందిన రైతులు వారి సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారులతో మాట్లాడారు.

## దేశభక్తిని పెంచుకోవాలి

మైదుకూరు అక్టోబరు16 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ నారాయణమూర్తి సూచించారు. 45మంది ఎన్‌సీసీ విద్యార్థులకు గురువారం ఎ సర్టిపికేట్‌లు అందించారు. లెఫ్టినెంట్ కల్నల్ లలి త్‌బాబు, అసోసియేట్ అధికారి సురేంద్రనాయక్, పాల్గొన్నారు.

## బాలికా విద్య అవసరం

రాజుపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలికా విద్య అవసరమని వక్తలు పేర్కొన్నారు. వెల్లాల గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని సీడీపీవో అరుణకుమారి నిర్వహించారు.

